క్లుప్తంగా

మహాదేవునికి లక్ష బిల్వార్చన



స్వామివారికి నిర్వహించిన లక్ష బిల్వార్చన

కొయ్యలగూడెం: కార్తీకమాసం పురస్కరించుకుని అంకాలగూడెంలోని స్వయంభు శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానంద ఆచార్యుల పర్యవేక్షణలో తెల్లవారుజాము నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య సేవ, మహాన్యాసము, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి అనంతరం లక్షబిల్వార్చన పూజ ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు చేపట్టి అనంతరం జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు కొనతం రవితేజ శ్రీవిద్య దంపతుల సౌజన్యంతో అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బిల్వార్చన పూజల్లో పాల్గొన్నారు.

శబరిగిరికి అయ్యప్పలు



టెంపుల్స్ సెంటర్‌లో ఇరుముడి పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

కొయ్యలగూడెం: అయ్యప్ప మాలధారణ దీక్ష చేపట్టిన స్వాములు శబరిగిరి పుణ్యక్షేత్రానికి ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములు ఇరుముడులతో గ్రామంలోని ప్రధాన దేవాలయాల్లో పూజలు నిర్వహించి పోలవరం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు హైవేలలో పాదయాత్ర నిర్వహించారు. శరణు ఘోష చేస్తూ శబరిగిరి క్షేత్రానికి తరలిన స్వాములకు బంధుమిత్రులు ఘనంగా వీడ్కోలు పలికారు.

మంచి నడవడిక కలిగి ఉండాలి



ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్న ముస్లింలు

ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనివారిగూడెం మసీదులో ఆదివారం దీన్ ఇస్తిమా (ఆధ్యాత్మిక కార్యక్రమం) నిర్వహించారు. ఇస్మాయిల్, మీరాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్లిం సోదరులు మాట్లాడుతూ ప్రవక్త అనుచరులుగా సమాజంలో మంచి నడవడికతో పాటు, సహాయ కార్యక్రమాలు చేస్తుండాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం, మున్సిర్, నాగిస్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

కొయ్యలగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ప్రజా ధర్నాలో రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ సంఘం కోరింది. ప్రజాధర్నాకు సంబంధించి ఆదివారం కరపత్రాలను నేతలు విడుదల చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. వివిధ రంగాల వర్కర్లు, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, పింఛన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల దుర్గారావు, సీహెచ్ సత్యనారాయణ, సీహెచ్ మరిడియ, మరి త్రిమూర్తులు, ఎస్.శివకుమార్, పి.తమ్మారావు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

ఏలూరు (మెట్రో) : ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగి దాని నియంత్రణ, నివారణకు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి బాలాజీ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ (ఇంటిగ్రేటెడ్ ఎస్‌టీఐ, టీబీ, హెపటైటిస్-సి, హెపటైటిస్-బీ) ఇశ్చిత్ అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏలూరు జిల్లా జైల్‌లో ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉచితంగా హెచ్‌ఐవీ, టీబీ, సిఫిలిస్, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి పరీక్షలు నిర్వహించారు. జైల్ సూపరింటెండెంట్ స్వామి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంపై చలి పంజా

- విజృంభిస్తున్న చలి గాలులు
- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- ఇప్పటికే ఆస్పత్రులకు పెరుగుతున్న కేసులు
- పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



అలివేరులో చలిమంటలు వేసుకున్న దృశ్యం



గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రోడ్డులో మంచు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో చలి పులి పంజా విసురుతుంది. కొద్ది రోజులుగా తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. సాయంత్రం నాలుగు నుంచే చలి గాలులు వణికిస్తున్నాయి. రాత్రి సమయంలో చలి గాలులు మరింత తీవ్రంగా వీస్తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఈ విధంగా ఉంటే డిసెంబరు, జనవరి నెలల్లో చలి తీవ్రత ఎలా ఉంటుందోనని గిరిజన ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగ మంచు ఉదయం 9 గంటల వరకూ తగ్గడం లేదు. ఉదయం, సాయంత్ర సమయాల్లో బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈశాన్యం నుంచి వీస్తున్న చల్లని గాలుల కారణంగా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలి గాలులు కారణంగా ప్రజలు రాత్రి, ఉదయం బయటకు రావాలంటే బయపడుతున్నారు. అత్యవసరమైతేనే ఇళ్లలో నుంచి బయటకు వస్తున్నారు. గ్రామాల్లో చలి తట్టుకోలేక రాత్రి, ఉదయం ప్రజలు చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

గిరిజన ప్రాంతంలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కొండప్రాంతంలోని గ్రామాల్లో ఉదయం పూట 15 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బయట ప్రాంతంలో 17 డిగ్రీలు నమోదవున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పులకు తోడు రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతుండడంతో చాలా మందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అనేక మంది జ్వరాలతో పాటు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండగా, న్యుమోనియా బారిన పడుతున్నారు. ఇలాంటి సమస్యలతో అనేక మంది ఆస్పత్రుల బాట పడుతున్నారు.

ఆసుపత్రులకు పెరుగుతున్న తాకిడి



బుట్టాయగూడెంలో జ్వరం, దగ్గు, జలుబుతో వైద్యం పొందుతున్న దృశ్యం

డిసెంబర్, జనవరి నెలల్లో చలి తీవ్రత ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే స్వెటర్లు, మంకీ క్యాప్స్ ధరిస్తున్నారు. చలి తీవ్రతతో జలుబు, దగ్గు, న్యుమోనియా బారిన పడుతున్న వారు బాట పడుతున్నారు. గత కొద్ది రోజులుగా వ్యాధులు బారిన పడిన వారితో ఆసుపత్రులకు తాకిడి పెరిగింది. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఉన్న ఆసుపత్రులలో ఆయా వ్యాధులతో అనేక మంది వైద్యం పొందుతున్నారు. గత వారం రోజుల నుంచి 50 నుంచి 60 వరకు జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస కోస వ్యాధుల బారిన పడిన వారు ఆసుపత్రిలో వైద్యం పొందడంతోపాటు మందులు తీసుకుళ్తున్నట్లు వైద్యులు తెలిపారు. చలికాలంలో పిల్లలు, వృద్ధులు, శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చలికాలంలో అప్రమత్తంగా ఉండాలి



చలికాలంలో వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడేవారు. వెంటనే వైద్యులను సంప్రదించాలి. చలి గాలి ముక్కుల్లోకి వెళ్ళకుండా మాస్కులు ధరించాలి. వృద్ధులు, చిన్నారుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధుల్లో రక్త ప్రసరణ మందగించి గుండె జబ్బులు తలెత్తే అవకాశం ఉంది. వీరికి పౌష్టికాహారం అందిస్తూ ఇంట్లో విశ్రాంతి తీసుకునేలా చూడాలి. నిత్యం వ్యాయామం చేయడం మంచిది.

– జె.సురేష్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ, కేఆర్‌పురం

పేకాట, కోడి పందేల స్థావరాలపై దాడులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డులో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వీరి నుంచి రూ.4,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని తాడువాయి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి నుంచి రూ.1,600 నగదు, 1 కోడి పుంజు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ రాఘవాపురం పంచాయతీ తూర్ల లక్ష్మీపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 4 గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.3,650 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

హమాలీల కూలి రేట్లపై దిగొచ్చిన ప్రభుత్వం

ఏలూరు రూరల్: కూలి రేట్లపై హమాలీలు చేసిన ఆందోళన సత్ఫలితం ఇచ్చిందని ఏలూరు జిల్లా పౌర సరఫరా సంస్థ హమాలీల సంఘం అధ్యక్షుడు శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కూలి రేట్లు పెంచాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన హమాలీలు చేసిన నిరసనపై కూటమి ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హమాలీల సంఘం రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపారని వివరించారు. ఇందులో క్వింటాకు రూ.3 కూలి రేటు పెంచేందుకు అంగీకరించారని, దీనివల్ల ఇప్పటివరకూ క్వింటాకు రూ.25 ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు రూ.28 అందిస్తుందన్నారు. ఈ నిర్ణయంతో పెరిగిన నిత్యావసర ధరలతో అవస్థలు పడుతున్న వందలాది మంది హమాలీలకు మేలు జరుగుతుందన్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కళ్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని శ్రీ సర్వ మంగళ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం నుంచి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా వినాయక ఆలయం వద్దకు తోడుకొని వచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు తెంబూరి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ దారులుగా రాయుడు, గెడుచురి రాము, సురేష్ ఎ. శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్ దంపతులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపిశెట్టి వెంకట సూరి బాబు, కొప్పుల నాగేశ్వరరావు, ఇమ్మని జగదీష్, గిడుతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటులో వివాదం



గవరవరం దళితవాడలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగిన స్థానికులు

కొయ్యలగూడెం: గవరవరం గ్రామంలోని దళితవాడలో ఆదివారం సాయంత్రం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. పంచాయతీకి సమీపంలోని అనుకుని ఉన్న ప్రధాన రహదారికి పక్కన జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని దళితవాడకు చెందిన కొందరు యువకులు ఏర్పాటు చేశారు. అయితే తమకు చెందిన స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల వేరొక వర్గం వారు ఘర్షణకు దిగారు. దీంతో యువకులకు వేరొక వర్గం వారికి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. దళితవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివాదానికి సంబంధించిన స్థలం విషయంలో పంచాయతీ, రెవెన్యూ అధికారుల తాత్సారం వలన సమస్య జటిలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కళ్ళచెరువులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కామవరపు కోట: కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1987– 89లో ఇంటర్మీడియెట్ చదివిన పూర్వ విద్యార్థులు కామవరపుకోట మండలంలోని కళ్లచెరువు గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. రామిరెడ్డి శ్రీలత రెడ్డి పామాయిల్ తోటలో పూర్వ విద్యార్థులు కలుసుకుని కళాశాలలోని ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. తమ బ్యాచ్‌లో స్వర్గస్తులైన స్నేహితులకు, ఉపాధ్యాయులకు, నివాళులు అర్పించారు. కళాశాలలో పనిచేసిన ఆంగ్ల అధ్యాపకులు (రిటైర్డ్ ప్రిన్సిపాల్) అబ్దుల్ ఖాదర్ దంపతులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు పీడీ అప్పారావు, వి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 108 ఉద్యోగుల సమ్మె బాట

- 15 డిమాండ్ల సాధన కోసం పట్టు
- నిలిచిపోనున్న అత్యవసర సేవలు



తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

బుట్టాయగూడెం: అపర సంజీవని 108 అంబులెన్స్ సేవలు నేటి నుంచి నిలిచిపోనున్నాయి. ప్రజలకు అత్యవసరంగా తమ వంతు సాయం అందిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడే 108 సిబ్బంది నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 108 సిబ్బంది పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే సిబ్బంది పలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 25లోగా ప్రభుత్వం స్పందించకపోతే సేవలు నిలిపివేస్తామంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే ముందస్తు నోటీసులను ఉన్నతాధికారులకు అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటి నుంచి 108 అంబులెన్స్ సేవలను నిలిపివేస్తూ సిబ్బంది సమ్మెబాట పట్టనున్నారు.

రోగులకు అవస్థలే

24 గంటలు అత్యవసర సేవలు అందిస్తున్న 108 ఉద్యోగులు సమ్మెబాట పట్టడం వల్ల రోగులకు పాట్లు తప్పవని అనిపిస్తుంది. ఇప్పటికే పలు మండలాల్లో 108 వాహనాల మరమ్మతు పేరుతో సేవలు దూరమయ్యాయి. ఇప్పుడు సిబ్బంది సమ్మెబాట పట్టడం వల్ల డయాలసిస్ రోగులు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాల బారిన పడే క్షతగాత్రులను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

108 ఉద్యోగుల డిమాండ్లు ఇవే

- 108 సర్వీసులోని ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీఓ నెంబర్ 49ను పునరుద్ధరించాలి. పైలట్ (గ్రాట్యుటీ, ఎర్నడ్ లీవు అమౌంట్ (అర్హత సెలవు మొత్తం) వార్షిక ఇంక్రిమెంట్‌ను చెల్లించాలి.
- ప్రతీ నెలా జీతాల చెల్లింపు 5లోగా జరగాలి. 108 వాహనంలో షిఫ్టుల పద్ధతే అమలు చేయాలి.
- వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలి.
- 108 సర్వీసులో ఈఎంటీలుగా పనిచేస్తున్న వారి సర్వీసును పరిగణనలోకి తీసుకుని వైద్య ఆరోగ్యశాఖలో డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీలలో చేపడుతున్న ఈఎంటీ పోస్టులను నియమించాలి.
- రెండు షిఫ్టులలో షిఫ్టుకు 12 గంటల చొప్పున తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్న తమకు మూడు షిఫ్టులలో రోజుకు 8 గంటల పనిదినాన్ని అమలు పరచాలి.
- వాహనాలను సరైన కండీషన్‌లో ఉంచాలి. వాహనం మరమ్మతు బిల్లులు ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి.
- 108 వాహనానికి, దానిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన భవనాన్ని నిర్మించాలి.

మా సమస్యలు పరిష్కరించాలి



108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతున్నాం. ఎన్నో సంవత్సరాల నుంచి 108 వాహనంలో పనిచేస్తున్నాం. మా సమస్యలు విని వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేసి న్యాయం చేయాలి.

– డి.రాంప్రసాద్, 108 సిబ్బంది, బుట్టాయగూడెం

షిఫ్టుల పద్ధతి అమలు చేయాలి



ప్రస్తుతం ఉన్న 12 గంటల డ్యూటీ విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. దీనివల్ల పని ఒత్తిడి తగ్గుతుంది. మూడు షిఫ్టులలో రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. తమ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

– కె.ఆనందరావు, 108 సిబ్బంది, జంగారెడ్డిగూడెం

అత్యవసర సెలవుల తగ్గింపుపై పునరాలోచించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులకు ఇచ్చే అత్యవసర సెలవులను మండలం మొత్తం మీద 10 శాతానికి పరిమితం చేయాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను పునరాలోచించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు కోరారు. బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక శనివారపుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చే అత్యవసర సెలవులను తగ్గించడం సరికాదని, గతంలో మాదిరగానే పాఠశాల స్థాయిలో 50 శాతం వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీటీఏ ఏలూరు జిల్లా పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. ఈ సమావేశానికి బీటీఏ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జీ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు బీ మనోజ్ కుమార్, కే గిరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ధర్మలింగం, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను వేలేరుపాడులో ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మిర్యాల శ్రీనివాసరావు

వేలేరుపాడు: గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల వేలేరుపాడు మండలంలో లేకపోవటం బాధాకరమని గిరిజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల శ్రీనివాసరావు అన్నారు. వేలేరుపాడు మండల పరిధిలో ఉన్న ఏకైక ఆశ్రమ బాలురు పాఠశాలను 2022 వరదల సమయంలో బుట్టాయగూడెం మండలం లంకపాకలకు తరలించారన్నారు. ఇక్కడ ఉన్నటువంటి గిరిజన విద్యార్థులు చాలామంది ఆ స్కూల్‌కి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులు అనారోగ్యం పాలై డ్రాప్ అవుట్ అవుతున్నారని, బాలుర నిరక్షరాస్యత పెరుగుతుందన్నారు. లంకపాకలకి సరైన రవాణా సదుపాయం లేదని, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందించి చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ పరిషత్ వేలేరుపాడు మండల ప్రధాన కార్యదర్శి బంధం ప్రసాద్, పైదా రమేష్, కుడియం శివరాజ్, తెల్లం వెంకట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధనలు



జంగారెడ్డిగూడెం: కాపు కార్తీక వన సమారాధనలో మాట్లాడుతున్న కరాటం,



జంగారెడ్డిగూడెం: డీఎస్పీ రవిచంద్రను సత్కరించిన దృశ్యం



కొయ్యలగూడెం: పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం

జంగారెడ్డిగూడెం: కాపులు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం కాపు కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటం రాంబాబు మాట్లాడుతూ కాపులు కేవలం వ్యవసాయంపై ఆధారపడకుండా ఉద్యోగాలు, వ్యాపారంపై కూడా దృష్టి సారించి అభివృద్ధి చెందాలన్నారు. పొలాలకు వెళ్లేందుకు పుంత రహదారులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేల దృష్టికి రాంబాబు తీసుకెళ్లారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ ద్వారా కాపుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకట రాజు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, డీకేడీ సత్యనారాయణ, కాపు సంఘం నాయకులు రావూరి కృష్ణ, పారేపల్లి రామారావు, కరాటం సాయి, దాకారపు కృష్ణ, నామా శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

సైబర్, డిజిటల్ నేరాలకు పాల్పడేవారు వృద్ధులనే లక్ష్యంగా ఎంచుకుంటున్నారని, అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర సూచించారు. బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్తీక వన సమారాధనకు డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డాక్టర్ చిదంబరం ఘంటశాల పాటల ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామచంద్రరావు, కార్యదర్శి డి. కేదాశ్వర రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సంఘాల వన సమారాధనలు

కొయ్యలగూడెం: కార్తీకమాసం నాలుగో ఆదివారం పురస్కరించుకుని పలు సామాజిక సంఘాలు, విద్య, వైద్య సంస్థలు కార్తీక వన సమారాధనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు జరిపారు. రేపల్లెవాడ మేధా స్కూల్‌లో ప్రాంతీయ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఏఎంసీ యార్డ్ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దామోదరుని పూజ, ఉసిరి వృక్షానికి కార్తీక పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన మెట్ట ప్రాంత కాపు వన సమారాధనకు కొయ్యలగూడెం నుంచి అధిక సంఖ్యలో కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజలు తరలివెళ్లారు. మహిళలకు వివిధ విభాగాల్లో సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.